
గ్లోబల్ హాస్పటల్స్ - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన హాస్య కథ

# అవంతిక ఆవకాయ పెట్టింది

పొత్తూరి విజయలక్ష్మి



**ఎ.సి.రూమ్‌లో కూర్చుని ఉన్నారు అందరూ. నిర్మాతలు నడుమున చేతులు కట్టుకుని పచార్లు చేస్తున్నారు. దర్శకుడు మిగిలినవారు కూర్చుని బుర్ర వేడెక్కిపోయేలా ఆలోచిస్తున్నారు.**

**కొత్త సినిమా తీసే బృహత్తర ప్రయత్నంలా వున్నారు వారందరూ. నిజానికి కొత్త సినిమా అంటే ఉత్సాహం పురకలు వెయ్యాలి. కానీ అందరూ నూట ఇరవై ఒకటోసారి సత్యనారాయణ వ్రత కథ వింటున్న వారిలా కునికి పాట్లు పడుతున్నారు.**

వీళ్ల వ్యవహారం చూస్తుంటే చిరాగ్గా ఉంది నిర్మాతలకి. రెండు నెలల నుండి సబ్జెక్ట్‌మీద కూర్చుంటున్నారు. తిండికీ తీర్థానికీ బోలెడయిపోతోంది గానీ కథ మాత్రం దొరకడం లేదు. దాంతో ఒళ్ళు మండి కాస్త నిష్ఠూరంగా మాట్లాడారు.

డైరెక్టరుకి కూడా ఒళ్ళు మండింది. "సరే వచ్చేవారం ముహూర్తం పెట్టుకోండి తర్వాత సంగతి తర్వాత చూద్దాం" అన్నాడు. దాంతో వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది.

ఇప్పుడు సినిమా తీసే పద్ధతి మారిపోయింది. అంతటి భారాన్ని ఒక్కరే భరించడం కష్టం కాబట్టి నలుగురైదుగురు నడుం కట్టి సినిమా తియ్యడం అలవాటు అయింది. లాభాలువస్తే తలాకాస్తా పంచుకోవాలనే తిరకాసు ఉన్నా డబ్బాలు తిరిగొస్తే తిలాపాపం తలాపిడికెడు అనుకునే వెసులుబాటు కూడా ఉంటుంది కదామరి!

ఇప్పుడా పద్ధతిలోనే ఓ సినిమా తీస్తున్నారు. ఇక్కడ ఇంకో లిటిగేషను కూడా ఉంది. ఓ యువకుడిని హీరోగా రంగప్రవేశం చేయించాలి.

అతగాడికి స్క్రీన్ టెస్ట్ జరిగిన రోజున అందరికీ జడుపుజ్వరాలు వచ్చాయి. మర్నాడు పొద్దున పీర్ సాహెబు వచ్చి గుగ్గిలం పొగవేసి అందరికీ తావీజులు కట్టి వెళ్లాడు.

సరే అందం అంటే దేవుడిచ్చినది. టాలెంటు అయినా ఉందా అంటే పాపం బిడ్డకి అదీ లేదు అతడికి డేన్సు నేర్పిన డేన్సు డైరెక్టరు చాటుకి వెళ్ళి కుళ్ళి కుళ్ళి ఏడిచాడు.

ఫైట్లు ప్రాక్టీసు చేయించేసరికి తలప్రాణం తోకకి వచ్చింది. ఫైట్ మాస్టరుకి లాభం లేదు డూప్‌ని పెట్టాల్సిందే అని చేతులెత్తేశాడు.

ఇటు అందమూ లేక అటు టేలెంటూ లేకపోతే ఎందుకతని హీరోయిజం అంటే అది దేవ రహస్యం.

రాత్రికి రాత్రి భార్యని తీసుకొచ్చి ఇదుగో మీ ఛీఫ్ మినిస్టరు అని లాలూప్రసాద్ అంటే బీహారు ప్రజలు భరించలేదూ!! ఇదీ అంతే.

కొన్ని కొన్ని విషయాలు గొంతుకి అడ్డం పడినా విషంలా మింగి వూరుకోవాలి.

ఇప్పుడా హీరోతో సినిమా తియ్యాలంటే కథా బలం ఉండాలి. అదేం ఖర్మమో మంచికథ కూడా దొరకడం లేదు!

సరే కానీ ముందు ముహూర్తం పెట్టి పని మొదలుపెడితే ముహూర్తబలం వల్ల మంచి కథ దొరుకుతుందేమో అని ముందుకు సాగారు.

హీరో రెడీగానే ఉన్నాడు.

ఇక హీరోయిన్. తమ దగ్గర కట్టలకొద్దీ పడున్న బాంబే పిల్లల ఫొటోల్లోంచి లాట్రీ పద్ధతిన ఓ ఫోటో తీశారు. పిల్ల పిట పిట లాడుతూ బాగానే ఉంది. ఓ.కే. అన్నారు.

మఖలో పుట్టి పుబ్బలో మాడిపోయిందని సామెత చెప్పినట్లు ఒక సినిమా చేసి పోయే హీరోయిన్ గురించి అంతకన్నా పరిశీలనలు అనవసరం.

అదృష్టవశాత్తూ మనకు మణి పూసల్లాంటి కేరెక్టరు ఏక్టర్లు ఉన్నారు. వాళ్లందర్నీ బుక్ చేసేశారు.

మంచి ఫామ్‌లో వున్న సంగీత దర్శకుడిని బుక్ చేశారు.

మాటల రచయితని బుక్ చేసేశారు. ఆయన ఇప్పటికే వందలాది చిత్రాలకు మాటలు రాసేశారు. ఆయన దగ్గరా ఫైలుంటుంది. అందులో డైలాగు లన్నీ రాసి వుంటాయి.

ప్రతి సినిమాలోనూ సందర్భానుసారం పదాలను చేర్చి డైలాగులు రాసేస్తారు. ఉదాహరణకి ఓ సినిమాలో "ఒరే నాదెబ్బ గుంటూరు మిరపకాయ బజ్జీరా" అనిరాస్తే మరో సినిమాలో "ఒరే నాదెబ్బ చిట్టూరం చేగోడీరా" అని రాస్తాడు.

కథానుసారంగా ఓ సినిమాలో హీరోయిన్ తల్లి కూతురితో "అమ్మా మనది మంచి వంశం. మీ నాన్నకి ఎదురు చెప్పకు. గంగలో దూకి చచ్చి మన వంశ పరువు ప్రతిష్ఠలు నిలబెట్టు" అని రాస్తే. 'మనది పౌరుషమైన వంశం ప్రాణాలు ధారపోసి అయినా సరే మీ నాన్నని ఎదురించు. రక్తం ఏరులైయేలా పారినాసరే మన వంశ ప్రతిష్ఠ నిలబెట్టు' అని మరో సినిమాలో రాస్తారు.

పాటల రచయిత కూడా అంతే. ఆయన మహాకవి. పరిశ్రమలోకి వచ్చిన కొత్తల్లో ఆబాలగోపాలాన్ని అలరింపజేసే మధురమైన గీతాలు రచించారు. ఆ తర్వాత మార్పు

వచ్చింది. ముందర ట్యూనుకట్టి తరవాత సాహిత్యం రాయడం.
వంట చేసుకుని అతిథిని ఆహ్వానించడానికీ అతిథి వచ్చి కూర్చున్నాక వంట చెయ్యడానికీ తేడా లేదూ??

ఇక తర్వాత పర భాషా గాయకులు వచ్చి పాట్టం మొదలుపెట్టాక మరీ విరక్తి పుట్టింది ఆయనకి. నిర్లిప్తంగా అరగంటలో ఓ పాట రాసి పారెయ్యటం అలవాటు చేసుకున్నారు.

నటీనటవర్గం సాంకేతికవర్గం నిర్ధారణ అయిపోయారు కాబట్టి ముహూర్తం నిర్ణయించారు. ముక్కోటి దేవతలకూ పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి కుంకంబొట్లు పెట్టుకుని ఇంటర్వ్యూలు ఇచ్చారు.


"చాలా డిఫరెంట్ స్టోరీ. మంచి ట్విస్టే ఉంది. అసలు బిగినింగ్ నించీ చివరిదాకా చాలా వైవిధ్యంగా నడుస్తుంది. మంచి సాంగ్స్. మంచి మ్యూజిక్" అని కబుర్లు చెప్పారు.

కబుర్లైతే చెప్పారుగానీ కథ ఏది?

సరే కథ సంగతి తరవాత చూద్దాం ఈలోగా ఫారెనెళ్ళి పాటలు షూట్ చేసుకొద్దాం అనుకున్నారు.

హుటాహుటీ పాటలు తయారు చేశారు.

నీ బొడ్డుమీద పుట్టు మచ్చ! నాలో రేపింది పిచ్చకచ్చ అని ఓ పాట. నువ్వు లంగా కట్టుకున్నావు; నేను పంచె కట్టుకున్నాను. అని మరోపాట. 'నీకు పుటకతోనే పిచ్చీ చాదస్థం: నాకు జన్మంతా వెర్రీ వైరాగ్యం' అని ముచ్చటగా మూడో పాటా తయారు చేశారు. పాటలు తయారయ్యాయి కాబట్టి తట్టా బుట్టా కట్టుకుని ఫారెను పోయారు.



మిగిలిన వారు ఇక్కడ కథ మీద కూర్చున్నారు.

వాళ్లు పాటలు చిత్రీకరించుకుని తిరిగి వచ్చేశారు బానేవచ్చాయి. నీ లంగా నా పంచె పాటలో హీరోయిను లంగా కట్టుకోలేదు. హీరో పంచే కట్టుకోలేదు. ఇద్దరూ బిగుతు పేంటులే వేసుకున్నారు. అయినా అదంత పెద్ద విషయమేంకాదు. వెనకాల వున్న మంచుకొండలూ జలపాతాలూ చూస్తారుగానీ వీళ్ళేం కట్టుకున్నారో ఎవరు పట్టించుకుంటారు?

అదీగాక ఆ విషయాలు పట్టించుకునే తీరిక ఎవరికుంది? ఇక్కడ సమస్య పెనుభూతంలా ఉంటే అలాంటి చిన్న విషయాలమీదికి దృష్టి పోతుందా?

కథ లేదు. ఏం

చెయ్యాలి?

సరే అందాకా ఫైటు సీన్లు లాగించేద్దాం అనుకున్నారు. మంచి లొకేషను ఎంచుకుని రెండొందల టాటా సుమోలు అద్దెకి తీసుకుని రెండు బస్తాల పటకా కత్తులు సిద్ధం చేసుకుని రెండు లారీల మంది ఎక్స్‌ట్రాలను బుక్ చేసుకుని చలోమంటూ పోయారు.

హీరో తండ్రినీ, బంధువర్గాన్నీ ఒకవైపు, హీరోయిను తండ్రినీ బంధువర్గాన్నీ మరోవైపు నిలబెట్టారు.

ఎక్స్‌ట్రాలను రెండు గ్రూపులుగా విభజించి రెండు గ్రూపులా వెనకా కత్తులిచ్చి నిలబెట్టారు.

"ఒరేయ్! నాకో పెట్టుకోకు. నీ డొక్క చీరి డోలుకడ్తా ఆ డోలు వాయిస్తూ మా గ్రామ దేవత జాతర్లో డేన్సు చేస్తాను' అన్నాడు హీరో తండ్రి.

"ఏడిశావులే! నీకాళ్ళు విరిచి గాడిపొయ్యిలో పెట్టి ఆ మంటమీద బిర్యానీ వండుకుని వనభోజనం చేస్తాను" అన్నాడు హీరోయిన్ తండ్రి.

"నీ కళ్ళుపీకి గోలీలు ఆడుకుంటా" అన్నాడు ఆయన.

"నీ చెవులు పీకి చిళ్ళంగాడీ ఆడుకుంటా" అన్నాడు ఈయన అలా కాసేపు వాదించుకుని "చూస్తారేంరా వేసెయ్యండి" అన్నారు ముక్తకంఠంతో. అప్పటిదాకా నుంచుని నుంచుని కాళ్ళు పీకెడుతున్న ఎక్స్‌ట్రాలు ముందుకి వురికారు.

బ్రహ్మాండంగా సాగింది యుద్ధం అవయవాలు తెగి పడ్డాయి. రక్తం ఏరులై ప్రవహించింది. నాలుగు టాటా సుమోలు భగ్గుమంటూ గాల్లోకి ఎగిరాయి.

"భేష్ బాగా వస్తాయి ఫైట్సు" అనుకుని తృప్తిగా తిరుగుముఖం పట్టారు యూనిట్‌వారు.

మళ్లీ కథ మీద కూర్చున్నారు. నమోస్తు నారాయణా. కథ దొరకలే. అవతల కేరెక్టరు యాక్టర్లు కాల్‌షీట్స్ ప్రకారం వచ్చి పీకలమీద కూర్చున్నారు. ఏం చేద్దామా అని బుర్రలు పట్టుకున్నారు. ఓ పని చేద్దాం అని మళ్ళీ రంగంలోకి దూకారు.

హీరోని హీరోయిన్ తండ్రి మనుషులచేత చావగొట్టించే సీను తీశారు. హీరోయిన్‌ని తండ్రి జుట్టుపట్టుకుని బర బర లాక్కెళ్ళి గదిలో పెట్టి చావగొట్టి చెవులు మూసేసీను కూడా తీసేశారు.

నలుగురు ఎక్స్‌ట్రాలనీ కమెడియన్‌నీ తీసుకుపోయి నగరం నడిబొడ్డులో నాలుగు కామెడీసీన్లు కూడా తీసేశారు.

ఆ తర్వాత సినిమాలోని ఆడంగులంతా ఇంతింత జరీ చీరెలు కట్టుకుని నగలు దిగేసుకుని వ్రతం చేస్తుంటే మగాళ్ళంతా మీసాలు మెలేసుకుంటూ ఆనందించే సీను పాటపెట్టి లాగిపారేశారు. మళ్ళీ కథ మీద కూర్చున్నారు.

హీరో, హీరోయిన్ బాల్యం సీన్లు తీద్దాం. మామూలుగా ఆటలాడుకునే వయసునించీ కాకుండా మెటర్నిటీ హోమ్‌లో తీద్దాం.

హీరో పుట్టిన పదిహేను రోజులకి హీరోయిన్ పుట్టింది. తల్లులు ఇద్దరి మంచాలూ

> **నా**కు హాస్య కథల పోటీకి ప్రత్యేక బహుమతి ఇచ్చినందుకు కృతజ్ఞతలు. నేను 1980 నుంచి రచనలు చేస్తున్నాను. నా తొలిరచన ఆంధ్రప్రభ వీక్లీలోనే ప్రచురితమైనది. ఇంతవరకూ సుమారు 20 నవలలు, వందదాకా కథలు రాశాను. హాస్యం అంటే నాకు చాలా ఇష్టం. హాస్యం రాసే వారందరూ నా అభిమాన రచయితలే. నేను రాసిన మూడు నవలలు సినిమాలుగా వచ్చాయి. 'శ్రీవారికి ప్రేమలేఖ' తొలి చిత్రం. ఈ పోటీకి బహుమతి రావడం చాలా సంతోషంగా వుంది.
> మరోసారి కృతజ్ఞతలతో...
> **పొత్తూరి విజయలక్ష్మి**

పక్కపక్కనే ఇద్దరి ఉయ్యాళ్ళూ పక్కపక్కనే ఉన్నాయి. ఓరోజు హీరో నోట్లో పాలసీసాపెట్టి నర్సు పెత్తనానికి వెళ్ళింది. ఆ పాలసీసా పక్కకి కదిలింది. హీరో గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. తల్లులిద్దరూ మొద్దుల్లా నిద్రపోతున్నారు. హీరోయిన్ లేచింది. పక్కకు దొర్లి ఉయ్యాల్లోంచి కాలు బయటపెట్టి పక్కనున్న ఉయ్యాలని తన్నింది. ఆ కదలికకి ఉయ్యాల కదిలి పాలసీసా పీక మళ్ళీ హీరో నోట్లోకి వచ్చేసింది.

ఏడుపాపి తృప్తిగా పాలుతాగాడు హీరో, పక్కకి తిరిగి హీరోయిన్‌ని చూసి నవ్వేడు. హీరోయిన్ సిగ్గుగా నవ్వింది.

సీన్ చెప్పారు రచయితగారు.

"భలే బావుంది తీసేద్దాం. నర్సింగ్ హోమ్ సెట్ వేసేద్దాం. ఇద్దరు పిల్లలు కావాలి" అన్నాడు డైరెక్టరు.

"సీను బానే ఉంది. కానీ ఇలా కాలక్షేపానికి సీను మీద సీను తీసుకుంటూ పోతే అవతల మనకు టోటల్ లెంగ్త్‌లో ప్రాబ్లమ్ కాదూ? ఇంతమటుకూ తీసిన పిక్చరంతా బాగానే ఉంది కానీ అసలు పాయింటు అలాగే ఉండిపోయింది కదా! ఆ విషయం ఆలోచించండి." అన్నాడు తలపండి పోయిన అసిస్టెంటు డైరెక్టరు.

"నిజవేస్మీ! అసలా విషయమే మర్చిపోయాం" అనుకున్నారు అందరూ ఈ ఒక్కసీనూ నాకు బాగా నచ్చింది తీసేద్దాం అన్నాడు డైరెక్టరు.

సరే ఆ సీను కూడా తీసేశారు.

"రెడ్డొచ్చె మొదలాడె." మళ్ళీ కథాచర్చ ప్రారంభం.

విడివిడిగా పడిఉన్న ఈ ముక్కలన్నీ కలిపి ఓ కథ తయారు చెయ్యాలి,

ఎదుటి టీమ్ వాళ్ళు మూడొందల ఎనభైరన్స్ చేశాక రంగంలోకి దిగి అరవై పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి వర్షం పడితే బావుండునని ఆకాశంవైపు ఆశగా చూస్తున్న భారత క్రికెట్టు టీములాగా కథకోసం ఆకాశంలోకి చూడసాగారందరూ.

ఓ వారం రోజులు సుదీర్ఘ చర్చలు జరిగాయి. చివరికి ఓ కొలిక్కి వచ్చింది. హీరోది ఆవకాయ తినే వంశం. నాలుగెకరాల మామిడి తోటలో కాసిన కాయలు కోయించి స్వంత చేలలో పండిన మిరపకాయల కారం, నువ్వులాడించిన నూనె కలిపి పెద్ద వాటరు టేంకునిండా ఆవకాయ పెట్టించుకుని ముప్పూటలా లొట్టలేసుకుంటూ తింటూ వుంటారు. తరతరాలుగా ఇదే వారి సంప్రదాయం.

అవతల హీరోయినూ వాళ్ళు ఇదే లెవెల్లో చింతకాయ పచ్చడి తింటూ ఉంటారు. వాళ్ళూ ఒకప్పుడు ఆవకాయ తినేవాళ్ళే. కానీ వారి వంశంలో ఓ ముసలమ్మ అటకఎక్కి ఆవకాయ కుండ దింపుతూ కాలుజారి కిందపడి నడుం విరిగింది. ఆవకాయకుండ నెత్తిన పడి తలప గిలి ఆన్ ది స్పాట్ చచ్చిపోయింది. ఈ దుర్ఘటన తర్వాత వారికి ఆవకాయ చూసినప్పుడల్లా ఆ ముసలవ్వ రక్తం గుర్తువచ్చి మనసు పాడైపోతుంది.

అందుకే ఆవకాయ మానేసి చింతకాయ తింటున్నారు.

అలా ఓ తరం గడిచిపోయింది.

ఆ తర్వాత ఓసారి ఇరువంశాల మధ్య ఎద్దులపోటీ జరిగింది. ఆవకాయ వాళ్ళు

గెలిచారు. గెలిచినవాళ్ళు వూరికే ఉండక చింతకాయ వారిని హేళన చేశారు.

దాంతో వైరం పెరిగి తలకాయలు నరికేసుకుని బద్ధ శత్రువులైపోయారు. మరి వాళ్ళ పిల్లా వీళ్ళ పిల్లాడూ ప్రేమించుకుంటే ఆ కక్షలు భగ్గుమనవూ!

చివరికి తన ప్రేమకోసం హీరోయిను ఆవకాయ పెట్టడానికి అంగీకరిస్తుంది. హీరోతో పారిపోతూవుంటే ఇరుపక్షాల వారూ వెతికి పట్టుకుని చావదన్ని కొనప్రాణాలతో వదులుతారు.

కానీ వారి ప్రేమ బలమైంది కాబట్టి ఇద్దరూ బ్రతికి బట్టకడతారు. పెద్దలకు జ్ఞానోదయం కలుగుతుంది.

కథ సుఖాంతం.

కథ సెట్ అయిపోయింది కాబట్టి మిగిలిన పార్టు కూడా తీసిపారేశారు.

"నా ఒంట్లో ప్రవహిస్తోంది రక్తంకాదు ఆవకాయనూనె" అని భారీ డైలాగులు హీరోచేత చెప్పించారు.

"మీరిలా కొట్టుకు చస్తున్నారు గానీ ఆవకాయా, చింతకాయా మన తెలుగు తల్లికి రెండు కళ్ళలాటివి అనుదినం ఆవకాయ తిన్నా జ్వరం వస్తే పథ్యంలోకి పాత చింతకాయ కావలసిందేగా. కాబట్టి చింతకాయని చిన్న చూపు చూడకండి. ఆవకాయని అందలం ఎక్కించకండి." అని ముసిలి పూజారి పాత్రచేత చెప్పించారు.

కథను గుణంగా వుండాలని మరో పాట రాయించారు.

"చింత తోపులో చెంత నువ్వుంటే
చెంచు పిల్లలా వున్నావే" అని పాట రాశారు రచయితగారు.

గాయకుడు బాంబేనించి ఎగ్జిక్యూటివ్ క్లాసులో వచ్చి ఫైవ్‌స్టార్ హోటల్లో ఉండి

"చెంచా టూప్వల్లా చిమ్తా నువ్వుంటే
చుంచూ పిల్లులున్నాయే"

అని పాడేసి మళ్ళీ ఎగ్జిక్యూటివ్ క్లాసులో ఎక్కి బాంబే వెళ్ళిపోయాడు.

పిక్చరు పూర్తయింది. ఎడిటింగూ వగైరాలన్నీ పూర్తయి ఫస్టుకాపీ వచ్చేసింది. వేసి చూసుకున్నారు.

పగలు చత్వారం రాత్రి చీకటి అన్నట్లు ఉంది సినిమా.

"ఇంకా నయంలే! ఈ మాత్రంగా వచ్చింది." అనుకున్నారు.

అదృష్టం కలిసి రావాలేగానీ కనక వర్షం కురుస్తుంది. ఇంతకంటే చెత్తసినిమాలు బ్రహ్మాండంగా ఆడిన సందర్భాలు కోకొల్లలు అనుకున్నారు.

దేవుడి మీద భారం వేసి రిలీజ్ చేసేద్దాం అనుకున్నారు.

సినిమా పేరు కూడా ట్రెండుకి తగ్గట్లు బాగా కుదిరింది.

"అవంతిక ఆవకాయ పెట్టింది"

టైటిల్ అదిరిపోయింది. ఇక సినిమా మరీ అదిరి పోతుంది. అన్నారు.

సినిమా రిలీజ్ అయింది.

రిలీజైన ప్రతీ సెంటర్లోనూ శతదినోత్సవం వైపు పరుగులు తీస్తోంది అని ప్రచారం చేసుకుంటున్నారు.

పరుగులు తీస్తోందా పట్టుకుని నడిపిస్తున్నారా ఆ పరమాత్ముడికి ఎరుక. ■


గ్లోబల్ హాస్పిటల్స్.. సాదర స్వాగతం ...



డాక్టర్ సుభాష్ చంద్ర సమాల్
ఎం.డి, డి.ఎం
(గ్యాస్ట్రోఎంట్రాలజీ)

గ్లోబల్ హాస్పిటల్స్ వైద్య నిపుణుల బృందంలో ప్రముఖ మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు డాక్టర్ సుభాష్ చంద్ర సమాల్ ఫుల్‌టైం సీనియర్ కన్సల్టెంట్‌గా చేరారని తెలియచేసేందుకు సంతోషిస్తున్నాము.

డాక్టర్ సమాల్, ఎం.డి, డి.ఎం (గ్యాస్ట్రోఎంట్రాలజీ) చేసి జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (జిప్‌మెర్) పాండిచ్చేరి, సి.ఎం.సి వెల్లూర్ లతో బాటు ఇతర ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇప్పటి వరకు సేవలు అందించారు.

అన్నవాహిక, ఉదరం, కాలేయం, పాంక్రియాస్, గాల్‌బ్లాడర్, పెద్ద, చిన్న ప్రేగులవ్యాధుల చికిత్సలో గ్లోబల్ హాస్పిటల్స్ ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉన్నది. అవయవాల మార్పిడి శస్త్రచికిత్సల కోసం ముఖ్యంగా కాలేయ మార్పిడి ఆపరేషన్ల కోసం దేశంలోనే ప్రప్రథమంగా ఏర్పాటైన సంస్థ.

గుర్తింపు:
ఇఎస్ఐ, ఎ.పి.ట్రాన్స్‌కో, ఎ.పి.జెన్‌కో, సిపిడిసిఎల్, ఎన్ఎండిసి, బిడిఎల్, ఎఫ్‌సిఐ

సి.జి.హెచ్, ఆరోగ్య భద్రత, దక్షిణ మధ్యరైల్వే, ఎన్‌టిపిసి, సింగరేణి కాలరీస్ మరెన్నో ప్రముఖ సంస్థలు

GLOBAL HOSPITALS
Medical excellence through Teamwork

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, లివర్ డిసీజెస్, రీనల్ డిసీజెస్, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, కోలోరెక్టల్ సర్జరీ, ఆంకాలజీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్.

లకడీకాపూల్, హైదరాబాద్ 500 004. ఫోన్: 040-2324 4444 (10 లైన్లు)
వెబ్‌సైట్: www.theglobalhospital.com